
# ప్రేమ పూజారి

పి.యస్. మణ్యం




**పేరు అనిల్.** పాపం, ప్రోగ్రెస్ మాత్రం నిల్. వయసెంతయ్యా అని అడిగితే ఇరవైకి ఒక అయిదు కలుపుకో అంటాడు. జీతమడిగితే వెయ్యిని సగానికి కోయ్ అంటాడు. ముఖం సగం మాత్రమే కనిపించే హిప్పీ జుట్టు స్క్రీన్‌కి సగం వరకు తొలగించిన కర్టెన్‌లా ఉంటుంది. మెలిదిరిగి మళ్ళీ కిందికి దిగిన మీసాలు. ఎత్తు ఆరడుగుల గుమ్మానికి అరడుగు తక్కువగా ఉంటాడు. కండలు తిరిగిన శరీరం కాకపోయినా కుండలాంటి పొట్ట మాత్రం లేదు. ఎప్పుడూ లైట్ డ్రెస్‌లో బ్లాకు బెల్టుతో టక్ చేసి కాలేజీ స్టూడెంటు వయసుతో, కాలేజీ లెక్చరరు స్టైలుతో కనిపిస్తాడు. నిజానికి అతను ఈ రెండూ కాదు. రెవెన్యూ డిపార్టుమెంటులో రెండు సంవత్సరాల నుంచి పన్చేస్తున్న రెండోశ్రేణి క్లర్కు.

అనిల్ చాలా సంవత్సరాలుగా ఒకే ఒక కోరిక

కలిగి ఉన్నాడు. ఎవరినయినా ప్రేమించాలి. అమ్మాయిల్ని మాత్రమే సుమా! ప్రేమించిన వాళ్ళనే పెళ్ళి చేసుకుని, ఆ ప్రేమతోనే జీవించాలి అనేది. కాని హైస్కూలు చదువు నుంచి కాలేజి చదువు వరకు ప్రతిదీ ఫెయిలుయ్యారే. ఎన్నో ప్రేమలేఖలు ఎవరెవరికో వ్రాశాడు. కాని వాటిని పోస్టు చేయలేదు. ఇప్పటికీ సూటుకేసులో జాగ్రత్తగా ఉన్నాయి. కారణం— నాలుగవ తరగతిలో చిన్న పేచీ వచ్చి పక్కింటి వసుధ ఇతని ముక్కుమీద గుద్దింది రక్తనాళాలు చిట్లి రక్తం కారేట్లు. అప్పటి నుంచి ఆడపిల్లలకు అటాక్ ఇవ్వాలంటేనే ఎక్కడ లేని జ్వరం ముంచుకొస్తుంది.

అతను జీవితంలో ఎవరెస్టు శిఖరం ఎక్కాడూ అంటే అది ఈ రోజే. ఆఫీసులో తనకు అసిస్టెంటుగా ఒక టైపిస్టును వేశారు. ఆమె పేరు వసంత. కోతికి కొబ్బరికాయ చిక్కినట్లయింది అతని పరిస్థితి.

సెక్షన్ హెడ్ పరబ్రహ్మం అనిల్‌ను పిలిచి, "బాబూ! ఈ అమ్మాయి పేరు వసంత. నీ సీటులో వర్కు హెవీగా ఉందని ఈమెను నీకు అసిస్టెంటుగా వేశాము. నీ పేపర్సన్నీ ఈమె చేత టైపు చేయించుకో" అంటూ పక్కనున్న పద్దెనిమిదేళ్ళ యువతిని పరిచయం చేశాడు.


అనిల్ తలెత్తి వసంతను చూశాడు. కళ్ళ ముందు ఒక తెల్లని వెలుగు రేఖ ప్రకాశిస్తూ కనిపించింది. నోట మాట రాలేదు. ఎవరీ అందాల రాశి? ఎక్కడో చూసినట్లుంది! ఎక్కడబ్బా! అని తల కొట్టుకున్నాడు. తరవాత గుర్తొచ్చింది. తనకు రాత్రుళ్ళు కలల్లో కనిపించే డ్రీమ్ గర్ల్ హేమమాలిని. హేమమాలిని ప్రతిరూపమే వసంత.

అక్కడ హెడ్ క్లర్కు పరబ్రహ్మం ఉన్న సంగతి పది నిముషాలకు గాని గుర్తు రాలేదు. గుర్తొచ్చి నెమ్మదిగా వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. వసంత వెనకనే వచ్చి 'నమస్తే, సార్' అంది తియ్యగా. జనవరి నెలలో ఎ. సి. రూములో కూర్చొన్నంత ఇదిగా జిల్ అయిపోయాడు. గొంతు తడారిపోగా, వణుకుతున్న చేత్తో ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాడు.

అనిల్ ఒక గంట గడిచిన తరవాత గాని మామూలు మనిషి కాలేకపోయాడు. ఆ అమ్మాయే చొరవ తీసుకుని ఎన్నో విషయాలు మాట్లాడింది. తనకు ఉద్యోగం చేయడం ఇష్టం లేదని, పరిస్థితుల వలన తను తప్పకుండా చేయవలసి వచ్చిందని, వర్కు తనకు కొత్త అని, తనపై కఠినంగా ప్రవర్తించవద్దని కోరింది. దానితో అతనికి ఎక్కడ లేని ధైర్యం వచ్చేసింది. ఏవో అనవసరమైన ప్రశ్నలు వేసి, అర్థం కాని జవాబులు పొంది, మనసు వికలమై, నిలకడ లేని ఆలోచనలతో జారుడు బండమీద జారుతున్నట్లయింది అతని పరిస్థితి.

* * * *

"భలే మంచి రోజు... పసందైన రోజు..." కూనిరాగాలు తీస్తూ ఆఫీసు కొస్తున్న అనిల్




గుమ్మంలోంచి సీరియస్‌గా వస్తున్న ఆఫీసర్ ఎదురయ్యే సరికి బల్లిలా—చెక్కిన శిల్పంలా గోడకు అతుక్కుపోయాడు. ఆయన్ని అలా పోనిచ్చి మిగతా చరణాలు పాడుకుంటూ లోపలికి వచ్చాడు.

ఆఫీసులో వాళ్ళంతా ఇతన్ని ఆశ్చర్యంగా చూశారు. ఎప్పుడూ టైముకు అరగంట ముందే వచ్చేవాడు. ఈ రోజు గంట లేటు. అటెండెన్సు రిజిస్టరు ఆఫీసరుకు పోయుంటుంది— ఏం రిమార్కులు వ్రాశాడో—తను టాయిలెట్ చేసుకోవడం ఆలస్యమయింది అనుకున్నాడు.

"గుడ్ మార్నింగ్, సార్!... కంగారు పడకండి. మీరు ఏదో పనుండి ఈరోజు లేటుగా వస్తానని నాతో చెప్పినట్లు ఆఫీసరు గారికి చెప్పాను" అంది వసంత అనిల్ ఆలోచనల్ని భగ్నం చేస్తూ.

అనిల్ కళ్ళలోంచి వెలుగు రేఖలు విరజిమ్మాయి. బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి ఆ బుగ్గల ఎరుపు చూసి వసంత బుగ్గలు ఇంకా ఎర్ర మందారాల్లా విరబూసి తల వంచుకొనేట్లు చేశాయి. అనిల్ ఇలా తన్మయత్వంలో పడిపోవడానికి కారణం ఆ అమ్మాయి తనకు సహాయం చేసిందని కాదు. నిన్నటి కంటె వేయి రెట్లు అందంగా తయారయి వచ్చింది ఈ రోజు.

ఆ బంగారు బుగ్గలు, నవ్వినప్పుడు కింద పెదవు లను చిన్నగా కొరికే తెల్లని పలువరుస, ఆ వాలు చూపులు, మధ్య మధ్య జడను ముందుకు వేసుకుని చూసుకోవడం కన్నార్పకుండా చూస్తున్న అనిల్‌కి ఇదంతా తనను కవ్వించడానికి చేస్తుందా, యాథాలాపంగా చేస్తుందా అనేది అర్థం కాలేదు. ఆమె మాటల్లో కనిపించే కొంటెదనం, వినిపించే రాగాలు ఎంత హాయిగా ఉంటాయి అనుకున్నాడు.

"మీరు చేసిన సహాయానికి థాంక్సండీ!" ఎలాగో గొంతు పెగల్చుకుని అన్నాడు.

"దానిదేముంది, సార్! రేపు నాకేదయినా అవసరమయితే మీరు చెయ్యరేమిటి" అంది ప్రశ్నార్థకంగా. సందేహం తీర్చండన్నట్లు సన్నగా గీచిన కాటుక రెప్పల్ని మెల్లగా ఆడిస్తూ అతని కళ్ళలోకి చూసింది. తమ ఇద్దరి కళ్ళను కలుపుతూ సిమెంటు రోడ్డు ఉన్నట్లు, ఆ రెండు చూపులూ ఆ రోడ్డు మధ్యలో ఒక దాన్నొకటి కౌగిలించుకున్నట్లు భ్రమ కలిగింది అనిల్‌కు.

"ష్యూర్!" అన్నాడు చివరకు.

ఆ రోజు తన సీట్లో ఉన్న ఫైల్సు గురించి వివరంగా చెప్పాడు వసంతకు. మోస్ట్ అర్జంటు, అర్జంటు, ఆర్డినరీ ఫైల్సును విడివిడిగా పెట్టి చూపించాడు. పైనుంచి వచ్చే పేపర్లకు ఎలా రిప్లైస్ ఇవ్వాలి? వాటి గురించికూడా చెప్పాడు. ఇంతలో ఒంటి గంట అయింది.

"ఇక భోజనం చేయండి" అంటూ పైకి లేచాడు.

"లేద్సార్! భోజనం చేసే వచ్చాను. మీరు వెళ్ళిరండి" అంది. ఆమె ముఖంలో అలసట కొట్ట వచ్చినట్లు కనిపించింది.

"నేనూ ఈ రోజు భోజనం తెచ్చుకోలేదు. మీ రలా వస్తానంటే కాంటీన్‌లో కాఫీ త్రాగి వద్దాం" అన్నాడు.

"అలాగే, పదండి" అంటూ మినీ బాగ్ భుజాన తగిలించుకుని అతని వెనకనే బయలు దేరింది.

అనిల్ మనస్సు పరిపరి విధాలుగా పోతూంది. 'ఈ అమ్మాయిని తను ఒక్క రోజులోనే ఎంత గాఢంగా ప్రేమించాడు. తను ఈ అమ్మాయితోనే జీవితాన్ని పంచుకోవాలి. లేదంటే వివాహమే మానుకోవాలి.'

"రెండు బ్రూ." ఆర్డ రిచ్చాడు.

తననే పరిశీలనగా చూస్తున్న వసంతను ప్రశ్నించాడు. "నేనంటే మీ కేం కోపం లేదు గదండీ?"

"అయ్యో! కోపమా! మీరు నా బాస్, సార్! నేను మీ అధీనంలో ఉన్నాను. నా మీద పెత్తనమంతా మీదే. మీ రేం చేసినా చెల్లుతుంది."

అనిల్ గుండెలో ఎవరో ఎక్కు పెట్టి వదిలిన

మల్లెల బాణం ఘాటుగా దిగింది. "ఓ మై గాడ్! భార్య మీద భర్త కుండే అధికారాలన్నీ తనకే ఇచ్చింది. ఇదే నిజమైతే!'


"మరయితే నే నేమన్నా మీా రేమనుకోరు కదా!"

'లేదు' అన్నట్లు తలూపింది. కొద్ది సేపు ఆలోచించి అన్నాడు: "మీారు చాలా అందంగా ఉంటారండి."

"అంతేనా!" చిరునవ్వు నవ్వి వూరుకుంది కాఫీ గ్లాసు కింద పెడుతూ.

"అంతే కాదు. మీారు భువి నుండి దివికి దిగి వచ్చిన అప్సరస. చంద్రుడు, నక్షత్రాలు మీా కాంతి వలననే ప్రకాశిస్తున్నాయి. మీా అందం, మీా గ్లామర్ హైలీ సుపర్బ్! నా కలల్లో కనిపించే హేమమాలిని మీారే!" నాలుక కరుచుకున్నాడు అనిల్ చివరి మాటకు.

"ఆపండి, సార్, మీా పొగడ్తలు! మరీ నే నంత



అందంగా ఉన్నానేమిటి— మీా మాటలు కాని!" ఓరగా చూసింది.

"ఏమయినా ఈ అందం ఎవరికో ఒకరికి ఎప్పటి కయినా చెందాల్సిందే గదా, సార్!" ఉడికిస్తూ అంది.

'ఎవరికో ఏమిటి ఖర్మ! నాకే చెందుతావు. ఇంకెవరయినా ఈ మాట అంటే పది మందిముందు పళ్లిగ్గొ పళ్ళు రాలగొట్టుందును.' లోలోపలే పళ్ళు కొరుక్కున్నాడు. తను అసలు విషయంలోకి దిగాలనుకున్నాడు.

"ఇక వెళదాం సార్! చాలా టైమయినట్లుంది."

"వసంతగారూ! మీారు లైఫ్‌లో ఎవరి నయినా ప్రేమించారా! లేక మీా కోసం మీా బావగారెవరైనా ఎదురు చూస్తున్నారా! మీారు పెళ్ళి చేసుకోకుండా ఉండడానికి ఇంకేదయినా కారణముందా!"

వసంత ముఖంలో అంచెలంచెలుగా రంగులు మారాయి. మేలిమి బంగారాన్ని కొలిమి లోంచి తీసి నట్లుగా ఎర్రగా తయారయింది. కళ్ళలోంచి నీళ్ళు కనురెప్పల్ని నిండుకున్నాయి. 'టప్, టప్' మంటూ ఒకదాని వెంటగా ఒకటే కన్నీటిబొట్లు బుగ్గలకు జారాయి. "ప్లీజ్ స్టాప్ ది మాటర్!" విసురుగా అని వడివడిగా వెళ్ళిపోయింది వసంత.

అనిల్ అంతవరకు కుర్చీకి జారగిలబడి ఉన్న వాడల్లా నిటారుగా కూర్చున్నాడు. 'ఎంతపని జరిగింది తను ఒక భగ్న హృదయిని ప్రేమించాడు. ఆమెఒక భగ్నప్రేమికురాలు. పెద్ద కథ ఉంది. ఎవర్ని ప్రేమించి ఎలా మోసపోయిందో? ఛీ! పెళ్ళి మాట ఎత్తేసరికి వెళ్ళిపోయింది.' అనిల్ మరొక కాఫీకి ఆర్డ రిచ్చాడు, తల దిమ్ము తగ్గుతుందని. అయినా ఆ అమ్మాయి ఎవరో తనెందుకు బాధ పడాలి?

అనిల్ వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. వసంత ముఖంలో ఆ కోపపు ఛాయలు ఇంకా తగ్గలేదు. అనిల్ తలెత్తి చూసేసరికి తన వైపు సూటిగా చూస్తూ ఉంది. అనిల్ ఆ చూపుల్ని తట్టుకోలేక తల దించుకుని ఫైల్సు వ్రాయడంలో మునిగి పోయాడు సీరియస్‌గా.

సాయంత్రం నాలుగయింది. అందరూ కాఫీలకు, టిఫిన్‌లకు వెళుతున్నారు. "ఏమండీ కాఫీకి వెళదామా! మును వేళ్ళతో ఎవరూ చూడకుండా అతని చేతిమీద టైపు చేసింది.

"నా కేదో విసుగ్గా ఉంది. మీారు వెళ్ళండి."

"ఆ విసుగు పోతుంది. రండి, సార్! ప్లీజ్". అంటూ చనువుగా అతను వ్రాస్తున్న ఫైలు అందు కుని మూసి టేబుల్ మీాద పెట్టింది.

"అది కాదండీ."

"ఏది కాదండీ! నాతో రండి. నేను మీా విసుగు పోగొడతాను" అంటూ బయలుదేరతీసింది. మౌనంగా ఆమెను అనుసరించాడు.

"రెండు సెవన్ లింక్స్..." ఆర్డ రిచ్చింది.

"సార్, మీాకు కోపమొచ్చినట్లుంది. నా మారేజి విషయం ఎత్తేసరికి నా కేవో గత జ్ఞాపకాలు వచ్చి నన్ను నేను కంట్రోలు చేసుకోలేక పోయాను."

'అవును — గ్రంథసాంగురాలివికదా!' మనసు లోనే తిట్టుకున్నాడు. ఇటువంటి వాళ్ళకే తిట్టడం, దగ్గరకు తీయడం రెండూ తెలిసి ఉంటాయి అను కున్నాడు.

"సార్! ఒకసారిలాగే నే ఇంటర్‌మీాడియెట్ చదివేటప్పుడు రమేష్ అని ఒక అబ్బాయి నాకు లవ్‌లెటర్ వ్రాశాడు, సార్. నా తీయని ముద్దు కోసం అతనొక జీవితకాలాన్ని వేస్ట్ చేస్తాడట. రమేష్ అందగాడు. డబ్బున్న వాడు—ఎంత బాగా వ్రాశాడు? నవ్వుతూ దగ్గరకు పిలిచాను. నా పరిచయం కోసం తపిస్తున్నాడు కాబోలు ఆనందంగా స్నేహితుల్ని వదిలి నా దగ్గరకు వచ్చాడు...అప్పుడు...సార్! సార్! ఏమిటి అలా వెళ్ళి పోతున్నారు? డ్రింక్స్ త్రాగండి. సార్." వసంత పిలుపు లేవీ అతని చెవి కెక్కలేదు, వడివడిగా తన సీటులోకి వెళ్ళి గంట పర్మిషను వ్రాసి పడేసి ఇంటికి బయలు దేరాడు.

టేబిల్ మీాద సెవన్ లింక్స్ బాటిల్స్ రెండూ ఆమెను వెక్కిరించాయి. దూరంగా ఆఫీసు రూమ్ లోంచి వడివడిగా వెళ్ళి పోవడం కనిపించింది. పర్సు లోంచి అయిదు రూపాయల నోటు తీసి సర్వరు చేతిలో పడేసి బయటకు నడిచింది. ఆమె తెల్లని ముఖాన్ని నల్లని మబ్బులు ముసురుకుని కాంతివిహీనం చేశాయి. ఆమె కళ్ళలో ఏదో తెలియని అశాంతి, ఆవేదన చోటు చేసుకున్నాయి.

'డామిట్! ఈమె ప్రేమ కథలు వినడానికి కాబోలు తను ఉండేది. ఎంత పచ్చిగా చెబుతుంది తన అనుభవాలు. ఆ రమేష్‌గాడు పెళ్ళి చేసుకుంటా నని చివరకు మోసం చేశాడు కాబోలు. ఛీ, ఛీ. పరువు పోయిన తరవాత ఇలా ఉద్యోగంలో చేరి ఉంటుంది.' రాత్రంతా ఆలోచనలతో, అశాంతితో పొర్లాడాడు. అందుకే ఆ రోజు డ్రీమ్ గర్ల్ హేమ మాలిని కలలోకి రాలేదు.

* * * *

"హలో! గుడ్‌మార్నింగ్. సార్!" విష్ చేసి తన సీట్లో కూర్చుంది. అప్పుడే విరిసిన గులాబీలా ఉంది. మంచు బిందువులతో శుభ్రపడి స్వచ్ఛంగా మెరిసే గడ్డిపూవులా ఉంది. వైట్ డ్రెస్‌లో తెల్లని పావురంలా ఉంది. ఆమెను చూడకుండా ఉండాలంటే అసాధ్యమయింది అనిల్‌కు. నిన్నటి తాలూకు భావాలు ప్రస్తుతం ఆమెలో ఏవీా లేవు.

"సార్! ఏదయినా పని చెప్పండి, చేస్తాను" అంది తనవైపు ఉన్న టైపు రైటరును టకటక లాడిస్తూ. టేబిల్‌కు ఈవల వైపు కూర్చున్న అనిల్ ఒకసారి తల పైకెత్తి మరలా దించుకున్నాడు. 'అవును, తనకు ఆమె మీాద కోపం దేనికి? తను పెళ్ళి గురించి అడిగితేనే గదా తన ప్రియుడు రమేష్ సంగతి చెప్పింది. తను సీరియస్‌గా ఉంటే మరీ ఆమెకు లోకువై పోతాడు' అనుకున్నాడు. 'ఆడవాళ్ళ సైకాలజీయే అంత. వాళ్ళ ఆలోచనలన్నీ నెగటివ్‌లో ఉంటాయి. తను మామూలుగా ఉంటే సరిపోతుంది.'

కొన్ని నిమిషాలు మౌనంగా గడిచాయి. "సార్! తమరు కాళ్ళను బుద్ధిగా ఉండమని చెప్పండి." పెదవి కొరుకుతూ తనకే వినబడేట్లు కొంటెగా అంది.

ఎదురుగా కూర్చుని ఉన్న అనిల్ ఆమె తెల్లని పాదాలు తన కాళ్ళ కింద నలుగుతున్నాయని తెలుసుకుని "సారీ!" అంటూ చటుక్కున లాక్కున్నాడు.

"ఈ లెటర్సు టైపు చేయండి." బొత్తిగా పెట్టిన లెటర్సు అందించాడు. "అలాగే" అంటూ విసురుగా లాక్కుంది. కొద్ది సేపట్లో టైపు చేసి అతని ముందు పెట్టింది.

"మీా వాలుజడ చేసిన పనికి సంజాయిషీ చెప్పు కోండి ముందు."

"ఏమిటండీ మీరు చెప్పేది?"

"అవునండీ! మీరు పేపర్సు తీసుకున్న విసురుకు మీ వాలుజడ మీ మెడను చుట్టి వచ్చి నా గూబ గుయ్యిమనిపించింది." సీరియస్‌గా అన్నాడు.

వసంత ఏమీ మాట్లాడ లేదు. కొన్ని నిమిషాలు గడిచాయి. "అలా కాంటీను వైపు వెళదాం, సార్." ఆప్యాయంగా అడిగింది. అనిల్ మౌనంగా ఉన్నాడు.

"రండి, సార్! అందరూ మనల్నే చూస్తున్నారు. మన మేదో మాట్లాడకూడని విషయం మాట్లాడు కుంటున్నట్లు..." రహస్యంగా అన్నట్లు అంది.

ఇక విభిశేక లేవాడు. ఇద్దరూ కాంటీన్‌లో కూర్చున్నారు. అనిల్‌కు ఏం మాట్లాడాలో తెలియ లేదు.

"నే నంటే మీ కెలాంటి అభిప్రాయముంది, సార్!" అడిగింది వసంత. మౌనంగా వూరుకున్నాడు. మళ్ళీ మళ్ళీ రెట్టించింది. చివరకు మెల్లగా అన్నాడు:

"మీరు ఒక భగ్న ప్రేమికురాలుగా నా కో విషమైన జాలి ఉంది!"

"వాట్? నే నో భగ్నప్రేమికురాలినా! నా మీద జాలా! నా గత చరిత్ర ఏదో తెలిసినట్లే మాట్లాడు తున్నారే" అంది ఆశ్చర్యంగా.

"ఇందులో వింతేముంది? మీరే చెప్పారుగా ఆ రమేష్‌గాణ్ణి మీరు..."

"నేనా... వాణ్ణా! డబ్బు, అందం ఉంటే సరి పోతుందా, సార్. ఆ ఉత్తరం వచ్చిన రోజే వాణ్ణి మంచిగా దగ్గరకు పిలిచి చెప్పుతో కొట్టాను." ఆమె చేయి సన్నగా వణికింది. ఆమె అంతరాంతరాల్లో దాగి ఉన్న అవమానం తాలూకు భావాలు ఒక్కసారిగా పెల్లుబికాయి.

"ఎక్స్‌క్యూజ్ మీ!" మెల్లగా అని తల వంచుకున్నాడు.

ఇద్దరూ కాఫీ త్రాగారు. "సార్, మీకు దెబ్బ చాలా గట్టిగా తగిలిం దనుకుంటాను. దీన్ని మీరే శిక్షించండి" అంటూ జడ గుండె మీదుగా టేబుల్ మీద పడేటట్లు ముందుకు వేసుకుంది.

"నేను కాలుత్రొక్కిపొరపాటు చేశానుగదండీ." బుద్ధిగా అన్నాడు.

"నా మీద మీ అభిప్రాయ మేమిటో చెప్పనే లేదు."

"మీరంటే నాకు చాలా ఇష్టం అండీ, వసంత గారూ."

"మన ఇష్టాయిష్టాలతో పనేముందండీ? మా తల్లితండ్రులుఒప్పుకోవాలిగా?" తలవంచుకొని సిగ్గుల మొగ్గలవుతూ అంది.

"మీ రెన్నయినా చెప్పండి! మీ రూపం నా హృదయంలో నిలిచిపోయింది."ధైర్యంగాఅనగలిగాడు అనిల్.

## 2

రోజుల్ని నెలలు మింగేస్తే, నెలల్ని సంవత్సరాలు మింగేస్తున్నాయి. అనిల్, వసంత చాలా చేరు వయ్యారు. ఆఫీసు వర్కు యథావిధిగా జరిగిపోతూ ఉంది. కానీ వీళ్ళ సంభాషనే మిగతా క్లర్కులకు బాధాకరంగా ఉంది. ఇంత అందమైన అమ్మాయి తమకు అసిస్టెంటుగా పడలేదే అని నాగేశ్వరరావు, ఈశ్వరదాసు, రజాక్, విక్టర్ తెగ పీక్కుని చస్తు న్నారు. వాళ్ళ పనే సాగడం లేదు. ఏదైనా కావాలని అడిగినా చాలా ముభావంగా జవాబు చెబుతుంది.

అనిల్ రెండు రోజుల లీవు తర్వాత ఆ రోజే ఆఫీసుకు వస్తున్నాడు. ఎల్లో కలర్ పాంటు మీద, రోజా కలర్ పూల షర్టు టక్ చేశాడు. బ్లాక్ చారల టై కట్టాడు. నల్లబూటు. సెంటు వాసనలు పరిమళిస్తూ ఉండగా అప్పుడే ప్లేన్ దిగిన హీరోలా పలకరించిన వారిని పలకరించని వారిని నవ్వుతూ విష్ చేస్తూ ఆఫీసు రూమ్‌లోకి వచ్చాడు.

వసంత ఆఫీసరుతో ఏదో మాట్లాడుతూ ఉంది. ఇతను వచ్చిన కొద్ది నిముషాల్లో వసంత వచ్చి తన సీట్లో కూర్చొంది. "హలో!గుడ్ మార్నింగ్, అనిల్ కుమార్ గారూ!ఎప్పుడువచ్చారు?"తీయగా అడిగింది. ఈ రెండు సంవత్సరాల్లో జరిగిన మార్పుల్లో 'అనిల్ బలవంతం మీద వసంత అతన్ని 'సార్' నుంచి అనిల్ కుమార్ గారూ' అనేంతవరకు వచ్చింది.

అనిల్ నవ్వి వూరుకున్నాడు.

"మీ పెళ్ళి చూపులు ఎలా జరిగాయి? మీ ఉడ్‌బి మిసెస్ గారు ఎలాఉన్నారు? నా కంటే ఎన్నో వందల రెట్లు బాగుంటుంది కదూ!"

# యువత

## మీ సాహితీ సంపద

### నిర్వహణ : మంజుశ్రీ

### గత సంచికలో ఇచ్చిన 'సాహితీ సంపద' సమాధానాలు

1. వేసవి కాలంలో చల్లదనాన్ని, చలికాలంలో వెచ్చదనాన్ని ఇస్తుంది మర్రినీడ అని ఆ చాటు శ్లోకం చెబుతున్నది "కూపోదకం వటచ్ఛాయా" ... ఇత్యాదిగా ఆ శ్లోకం ఉంది.
2. చిలుకూరి నారాయణరావు.
3. శబ్దరత్నాకరం. కూర్పరి బహుజనపల్లి సీతారామాచార్యులు.
4. నెల్లూరి కేశవస్వామి.
5. పాలగుమ్మి పద్మరాజు.
6. గోపీచంద్.
7. నాయని సుబ్బారావు.
8. తెలుగు.
9. శ్రీమతి ఆరెక పూడి ( కోడూరి ) కౌసల్యాదేవి.
10. బమ్మెర పోతన.

## 8

### ప్రశ్నలు

1. ఈ సంవత్సరాన్ని ఒక మహాకవి పేరిట సాంస్కృతిక సంవత్సరంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది? ఎవ రా మహాకవి?
2. పోతన మహాకవి రచించిన శ్రీ మద్భాగవతానికి కృతి నాయకు డెవరు?
3. శ్రీ మద్భాగవతంలో మొత్తం ఎన్ని స్కంధా లున్నాయి?
4. ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదు ఎవరిది?
5. అంతర్జాతీయ కథల పోటీలో బహుమతి గెలుచుకున్న తెలుగు కథ.
6. హిమబిందు అనే చారిత్రిక నవలా రచయిత ఎవరు?
7. మాలపల్లి రచయిత?
8. మహాభారతం చివరి పర్వం పేరేమిటి?
9. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమానం గెల్చుకున్న తొలి రచయిత్రి?
10. రామాభ్యుదయం అనే కావ్యం రాసిం దెవరు? ఆయన ఎవరి ఆస్థానంలో ఉండేవారు?

**సమాధానాలు వచ్చే సంచికలో**

"చ... నేను పెళ్ళి చూపులకు సెలవు పెట్టానని ఎవరు చెప్పారు, వసంతా ... చెప్పాగా, పర్సనల్ మేటరని."

"ఈవయసులో పర్సనల్ మేటరు అదేగదాసార్!" నవ్వింది. ఆమె నవ్వుకు పరవశించిపోయి గతంలోకి వెళ్ళిపోయాడు.

మూడు రోజుల క్రితం సంగతి ...

అనిల్ స్వతహాగా ప్రేమ విషయంలో అంత నేరుగా తెలియజేసే ధైర్యం లేదు కాబట్టి ఆ రోజు రాత్రి తెల్లవార్లూ మేలుకొని వసంత కొక లవ్ లెటర్ తయారుచేశాడు. తను చేసుకొంటే వసంతనే చేసుకోవాలనే భీష్మ ప్రతిజ్ఞ. ఇక్కడ ప్రతిజ్ఞయొక్క మోడ్ వేరు.

"మై డియర్ స్వీట్ వసూ!

నేను నిన్ను మనఃస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. కోయిల వసంతకాలం కోసం ఎలా ఎదురుచూస్తుందో అలాగే నా జీవితంలో వసంతం కురిపిస్తావని నీ రాక కోసం నా హృదయ మందిరం తెరిచి ఉంచాను.

హిమాలయాల్లో మానస సరోవరం ఒడ్డున మన కుటీరం—అందులో మన కాపురం—ఆ మంచు కొండల్లో పరుగులు—ఆ సుదీర్ఘ జలపాతాల క్రింద మన కంబైన్డ్ స్నానాలు—ఓహ్ ... ఎన్నని చెప్పను! అలా కలలు కనని రోజు నేను నిద్రపోలేదంటే నమ్ము.

నీవు మీ తల్లితండ్రులతో మాట్లాడి మన పెళ్ళి విషయం సెటిల్ చెయ్. నా మాటే మా తల్లి తండ్రులకు వేదవాక్కు.

అన్ని విషయాలకు వెంటనే జవాబు తెలియజేస్తావుగా! ప్లీజ్!!

ఇక ఆపేస్తా...

నీ ప్రేమకోసం పరితపించే నీ ప్రేమ పూజారి,..

—అనిల్!"

అలా వ్రాసిన లెటరు ధైర్యంగా ఆమెకు అందజేయలేక ఒక ఫైల్లో ఉంచి, "వసంతగారూ! ఈ నాలుగు ఫైళ్ళూ రేపు టైపుచేసి పెట్టండి. చాలా జాగ్రత్తగా చదివి చేయాలి సుమా! మోస్ట్ ఇంపార్టెంట్" అన్నాడు.

"అలాగే, అనిల్‌గారూ! తమరి లీవుకు కారణం అడక్కూడదనుకుంటాను."

"ఎగ్జాక్ట్లీ! వచ్చిన తర్వాత తప్పకుండా చెబుతాను" అంటూ అప్పటికి తప్పించుకున్నాడు.

గతంలోంచి తెప్పరిల్లి అడిగాడు—"ఆ నాలుగు లెటర్లు టైపు చేశారా?"

"ఆ మరురోజే చేసి సంతకాలకు పంపి ఉన్నాను, సార్" అంది ఎంతో సిన్సియర్‌గా.

"ఫైల్సన్నీ చదివేగదా టైపు చేసింది?"

"మీరు మరీ అమాయకులండీ! చదవకుండా టైపు ఎలా చేస్తానండీ?" మెల్లగా నవ్వింది.

అనిల్ ఆనందం అంతా ఇంతా కాదు. పెళ్ళయిపోయినట్లు, ఇద్దరూ కాశ్మీర్‌కు హనీమూన్ పోయినట్లు కలలు కనసాగాడు.

"ఇంతకీ మీ నిర్ణయం చెప్పరేమిటి?" అన్నాడు.

"మీరు అమ్మాయిని చూస్తే నే నా నిర్ణయం చెప్పేది? నన్నే మయినా పెళ్ళిచూపులకు ఆహ్వానించారేమిటి నా నిర్ణయం చెప్పడానికి?" నిష్ఠురంగా అంది తల త్రిప్పుతూ.


అనిల్ తల పట్టుకొన్నాడు. 'ఇంత అమాయకంగా మాట్లాడుతుందేమిటి? తన లవ్ లెటర్ మీద ఏం నిర్ణయం తీసుకుందో చెప్పదేం? అసలింతకూ ఉత్తరం చదివినట్లా లేక చించి కిటికీలోంచి పారేసిందా!'

"ఫైల్సన్నీ బాగా చదివా నంటున్నావు గదా! ఆర్. ఎస్. మూడొందలా ఒకటి నంబరు ఫైల్లో గ్రీన్ కలర్ లెటర్ చూశారా?"

"అవును. ఎందుకు చూడలేదు? చూశాను."

"దాన్ని చదవలేదా!"

"అవన్నీ ఎందుకు చదువుతాము, సార్? టైపు చేయబోయే పేపర్లే చదువుతాము. అది ఎంక్లోజర్ గదాఅని టైప్ లెటరుకు దాన్ని కుట్టి కలెక్టరు సంతకాలకు మేడ మీదకు పంపాను. ఏం—అంతమాత్రం నా మీద నమ్మకంలేదా?"




అనిల్ నెత్తిన అన్ని వందల టన్నుల స్కైలాబ్ పడ్డట్లయింది. భూమి రెండుగా చీలి అందులో పడినట్లు, ఆకాశం అయస్కాంతంలా తనని పైకి లాగినట్లు, సముద్రం తన ఉత్తుంగ తరంగాలతో అట్టడుగుకు లాగినట్టు ఫీలయ్యాడు.

'కలెక్టర్! ఇంకేముంది! ఆ లెటరు ఆయన చూశాడంటే!' ఏం చేయడానికి తోచలేదు. ఆ స్థానంలో ఆవేశం ముంచుకొచ్చింది.

"ఏం మనుషులండీ మీరు?... నాకు చెప్పకదూ మీరు ఫైలు సంతకాలకు పంపాల్సింది? కామన్ సెన్సు లేదు. ...చ...చ.... సరియైన టైపిస్టునే వెతికి వేశారు నాకు... బుద్ధి తక్కువై నీకివని చెప్పాను." రెండు చేతులతో తల పట్టుకుని కూర్చున్నాడు.

"ఎవరికండీ కామన్‌సెన్సు లేంది?... అర్జెంటు అని ఉంటే అర్జెంటు కాబోలని పంపాను. మిగతా ఫైళ్ళ గురించి నే నేమైనా పట్టించుకొన్నానా! బుద్ధిలేంది మీ క్కాదండీ—నాకు బుద్ధొచ్చేట్టు చేశారు . . . ఇన్నాళ్ళు నన్నర్థం చేసుకుంది ఇంత మాత్రమేనన్న మాట... జీవితంలో గుర్తుండేట్లు నాలుగు మాట లడిగారు..." నిశ్శబ్దంగా ఏడుస్తూ కళ్ళు తుడుచు కుంటూంది వసంత. ఎక్కిళ్ళు నిముషాల్ని లెక్కిస్తున్నాయి. ఇన్నాళ్ళ తమ స్నేహం ఒక్క క్షణంలో తెగిపోయినందుకు ఆమె కెంతో బాధగా ఉంది.

వీళ్ళ తగాదాను వింతగా చూస్తున్న ఖాసిం, 'ఇది వీళ్ళకు మామూలే! రేప్పొద్దున ప్రాణమిత్రుల్లా, జంటకవుల్లా, చెట్టుకూ కాయకూ ఉన్న సంబంధంలా అయిపోతారు' అనుకొని మరలా ఫైల్లో తలదూర్చాడు.

ఆ రోజు ఇద్దరిలో ఎవరూ ఆఫీసు పని సరిగా చేయలేదు. 'కలెక్టరు తప్పక ఫైలు చదువుతాడు. అందులో తన లవ్‌లెటర్ అతని కంట పడుతుంది. తనను ఉద్యోగం నుండి సస్పెండు చేస్తారు.

ఇక మానస సరోవరం స్థానంలో సహారా ఎడారి, జలపాతాల స్థానంలో నిప్పుల వర్షం కురుస్తుంది. అందులో ప్రస్తుతం ఉన్న కలెక్టరు దృష్టిలో క్షమించడమనే పదానికి అర్థం శిక్షించడం. తన ఉద్యోగం పోతే ఇంట్లో, స్నేహితుల్లో పరువు ఉంటుందా? వసంత ఎంత పని చేసింది? ఒకవిధంగా తప్పు తనదేమో' అనుకున్నాడు.

'అవును. ఎప్పుడూ లేంది తనతో అంత కఠినంగా ఎందుకు మాట్లాడాడు? ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా తీర్చుకోవచ్చు కదా. ఏదో ఇంట్లో స్వంత భార్యను దబాయించినట్లు ఆఫీసులో అందరి ముందు పరువు తీశాడు. ఇందులో తన తప్పేమయినా ఉందా? అతను చెప్పినట్లు తను చేసింది.' ఆలోచిస్తూంది వసంత.

అనిల్ ఆలోచనలను ఆపి, ప్రస్తుత పరిస్థితుల్ని గురించి ఆలోచించ సాగాడు. టైపు చేసిన తరవాత పేపర్సు సెక్షన్ హెడ్‌కు, అక్కడ నించి ఆఫీసరు ద్వారా కలెక్టరు సంతకాలకు పోతాయి. తరవాత కాంపు క్లర్కు కలెక్టరు నుంచి వచ్చిన ఫైళ్ళను సరిచూసి స్టెనోకి డిస్పాచ్‌కి పంపుతాడు. డిస్పాచ్ అయిన తరవాత ఫైళ్ళను ఏ సెక్షనుకు సంబంధించిన వాటిని ఆ సెక్షనుకు పంపుతాడు స్టెనో.

అనిల్ వెంటనే సెక్షన్ హెడ్‌ను చేరుకున్నాడు. "నమస్తే. సార్!" విష్ చేశాడు. టేబిల్ మీద తలపెట్టి హాయిగా నిద్రపోతున్న సెక్షన్ హెడ్ పరబ్రహ్మం కూర్చోమన్నట్లు నిద్రపోతూనే చేయి వూపాడు. "ఫామిలీ ప్లానింగులో ఉన్న లాభాలు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయోయ్! ఉన్న డజను మంది పిల్లలతో సతమతమై చస్తున్నాననుకో. తృప్తిగా నిద్ర పోవడానికి కూడా అవకాశం లేదు. అసలు నా సలహా అడిగితే రేపే వెళ్ళి ఫామిలీ ప్లానింగు ఆపరేషను చేయించుకో" అన్నాడు.

"నాకింకా పెళ్ళే కాలేదు, సార్."

"అవున్రోయ్. నా మాట విని చేయించుకోక

ఈ విషయం తెలిస్తే ఎవరూ నీకు పిల్ల నివ్వరు.'' పెద్దగా నవ్వాడు తన జోకుకు తనే. ఆ జోకు పుణ్యమా అని నిద్రలోంచి లేచాడు. విషయం అడిగి తెలుసుకున్నాడు.

"ఆ ఫైలు ఫైవు కాగానే కంపేర్ చేసి ఆఫీసరుకు పంపాను, సైడు ఇనిషియల్‌కు. ఇంకెక్కడుంటుంది—.అది ఈ పాటికి ఎప్పుడో హైదరాబాద్‌కు డిస్పాచ్ అయ్యుంటుంది'' అన్నాడు. అనిల్ దుఃఖాన్ని దిగమింగుకుని చుట్టూ చూశాడు. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు. తననే అప్పటివరకూ కళ్ళింతలు చేసుకొని చూస్తున్న వసంత చప్పున తల వంచుకుని తన పనిలో మునిగిపోయింది. 'రాక్షసి!' పళ్ళు కొరుక్కున్నాడు.

నేరుగా ఆఫీసరు రూము ముందు నిలుచున్నాడు. "ఒరేయ్, రాఘవులూ! ఈ రూపాయ తీసుకొని టీ త్రాగు!'' అంటూ రూపాయనోటు బయటకు తీశాడు. ఆఫీసరు రూము ముందు స్టూలు మీద కూర్చుని కునికిపాట్లు పడుతున్న రాఘవులు చప్పున అందుకొని జేబులోకి ఎక్కించాడు.

"ఒరేయ్! ఆఫీసరు గారి దగ్గర నా సీటు ఫైల్సు ఏమయినా ఉన్నాయట్రా?''

"లేవు, స్వామీ! అయ్యగారు కాంపులు ఎక్కువ పోతుంటే అలాగే ఉండేవి. ఇప్పుడు ఏ రోజు కా రోజు కలెక్టరుకు పోతున్నాయి.''


అనిల్ హతాశుడయ్యాడు. జనరల్‌గా ఆఫీసరు దగ్గర 'డిలే' ఉంటుంది. ప్రస్తుతం ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. 'ఇప్పుడేం చేయాలి? ఆ లెటరు కలెక్టరు చూసుంటాడా? చూసి తన మీద ఏక్షన్ తీసుకోమని పి. ఎ. కు కాన్ఫిడెన్షియల్‌గా చెప్పాడేమో!'

ఆలోచిస్తూ హుజూర్ సెక్షన్ వైపు మెట్లెక్కుతున్న అనిల్ ఎదురుగా వస్తున్న సివిల్ సప్లైస్ క్లర్కు పరదేశిని డాష్ ఇచ్చాడు. తరవాత "ఎక్స్‌క్యూజ్ మీ, రో!'' అంటూ రెండు చేతులూ పట్టుకున్నాడు. పరదేశి అనిల్‌ని ఆప్యాయంగా కౌగిలించుకొని, "ఏరా ఇలా చిక్కిపోయావు? ముఖం చూస్తే హోమెన్ ముఖంలా ఉంది. ఏం జరిగింది? నీ బట్టర్‌ఫ్లై వసంత నీతో ఏదైనా తగాదా పెట్టుకుందేమిటి?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

మేడమీదికి తీసుకెళ్ళి ఒక వారగా నిలబెట్టి తనలోని బడబాగ్ని నంతా బయటపెట్టి కొంత బరువు దించుకున్నట్లు ఫీలయ్యాడు అనిల్. "ఒరేయ్! జరిగిందేదో జరిగింది. నీ పక్కనే నే నుంటాను. నీ అదృష్టం బాగుంటే కలెక్టరు కాగితాలు ఇంకా చూసి ఉండడు.''

ఇద్దరూ కలెక్టరు కాంపు క్లర్కును చేరుకున్నారు. తమకు కావలసిన ఫైలు కలెక్టరు సంతకాలయి వచ్చిందా అని అడిగాడు. "తొందర దేనికయ్యా? నిదానంగా వస్తుంది, వెళ్ళండి'' అన్నాడు విసుగ్గా ఆయన పాదుం పీలుస్తూ.

"అసలు విషయం అదికాదు, సార్! జరిగిం దిది''




అంటూ విడమరిచి చెప్పాడు పరదేశి, అనిల్ వారిస్తున్నా వినకుండా.

"అద్గదీ! నాకు లవ్ విషయాలు వినాలంటే చాలా ఇష్టమోయ్! ఏదీ—మూడు లిమ్కాలు తెప్పించు—పార్టీ చేసుకుందాం. ఒరేయ్, ఏకాంతం! ఇదిగో, అయ్యగారు డబ్బు లిస్తారు. నువ్వో రూపాయి తీసుకొని మూడు లిమ్కాలు తెచ్చిపెట్టు.'' ప్యూన్‌ని పిలిచాడు కాంపు క్లర్కు. అనిల్ డబ్బు లిచ్చాడు. కొద్దిసేపట్లో లిమ్కాలు వచ్చాయి. తృప్తిగా త్రేన్చి రిజిస్టరు అలా అలా తిరగేసి, "అయ్యా, మీ ఫైల్సు సంతకాలు అయి తిరిగి వచ్చాయి. స్టెనో దగ్గరకు డిస్పాచ్‌కి వెళ్ళాయి'' అన్నాడు.

మారు మాట్లాడకుండా ఇద్దరూ స్టెనో రూము చేరుకొన్నారు. స్టెనో రెండు రోజులు లీవు. లీవు లెటరు పేపరు వెయిట్ క్రింద గాలికి రెపరెపలాడుతూ దర్శన మిచ్చింది.

* * * *

అనిక్ తన ఆరోగ్యం బాగులేదని నాలుగు రోజులు సెలవు పడేశాడు. స్టెనో అడ్రసు తెలియక ప్టోన్ అవుస్ పేట, బాలాజీ నగర్, రామలింగాపురం, పత్తేఖాన్‌పేట, చిన్న బజారు, రంగనాయకులపేట, ట్రంకురోడ్డు మొత్తం గాలించి వేశాడు. ఒకటవ నేల— టౌనులో ఎవరిచ్చిన అడ్రసూ పట్టుకొని అణువణువూ వెతికి చివరకు రెండో రోజు సాయంత్రం ఒక బార్‌ముందు గర్ల్ ఫ్రెండుతో మాట్లాడుతూ ఉంటే పట్టుకొన్నాడు.

అంతా విని, "హోరి నీ పాపం కూలా! ఈ రోజు నేను లీవు కాన్సిలు చేసుకొని ఆఫీసు కెళ్ళానయ్యా. నీ కాగితాలన్నీ వచ్చి ఉన్నాయి. అన్నీ డిస్పాచ్ చేసేశాను రిజిస్టరు పోస్టులో, ఈరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు. అరరె... నేనొక ప్రేమికుల జంటను విడదీశానే...అయ్యయ్యో! ఎంత పని జరిగింది?'' వాపోయాడు స్టెనో.

ఒక్క క్షణం అచేతనంగా నిలబడిపోయిన అనిల్ ఏదో స్ఫురించినట్లు ఎక్కుపెట్టిన బాణంలా హెడ్ పోస్టాఫీసుకు పరుగెత్తాడు. కాగితాలు హైదరాబాద్ స్పెషల్ ఆఫీసరుకు వెళ్తాయి. కలెక్టరు చూడ్డం మిస్ అయితే అక్కడ ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేడు. తన ఉద్యోగం నమ్మకంగా పోతుంది.

అనిల్ అరగంటపైగా వెయిట్ చేసి పోస్టుమాస్టరు ఇంటర్వ్యూ సంపాదించాడు. దాచుకోకుండా అంతా చెప్పాడు. పోస్టుమాస్టరు ఉగ్రుడయ్యాడు.

"నీలాంటి వాళ్ళవల్లనే సంఘంలో ఆడపిల్లలు బ్రతకలేకున్నారు. పోలీసు రిపోర్టిచ్చి నీ అంతు తేలుస్తాను. మా పెద్దమ్మాయిని నీలాంటి వాడెవడో అణాన్నర వెధవ లేపుకుపోయాడు. నిన్ను వదలడానికి వీల్లేదు'' అంటూ చడామడా తిట్టాడు.

బావిలోంచి వచ్చి చెర్లో పడ్డట్టయింది అనిల్ పరిస్థితి. ఇక ఎప్పుడూ ఆడపిల్లల జోలికి పోనని, ఈ పొరపాటును క్షమించమని, తమ పెద్ద కూతురును లేపుకుపోయిన వాడి అడ్రసు కనుక్కోవడంలో సహాయం చేస్తానని చెప్పాడు.

చివరి మాటకు ఆయ నేదో సంతోషించినట్లు కనపడి రిజిస్ట్రేషను క్లర్కును పిలిపించాడు. పోస్టుమాస్టరిచ్చిన పర్టిక్యులర్సును పురస్కరించుకొని వెళ్ళిన రిజిస్ట్రేషను క్లర్కు కొద్దిసేపట్లో తిరిగి వచ్చాడు. "సార్! అది మూడూ పది క్లియరెన్సులో వెళ్ళిపోయింది'' అన్నాడు.

"బాబూ! అంతా అయిపోయింది. జరగవలసినదేదో దేవుడే నిర్ణయించాడు. ప్రపంచానికి నీవల్లనైనా కొంత గుణపాఠం వస్తుంది.'' ఫక్కున నవ్వాడు పోస్టుమాస్టరు కళ్ళెగరేస్తూ.

'చ...జాలి తలవకపోతే మానె! ఎగతాళి చేయడం దేనికి?' ఇంకిపోయిన కళ్ళలోంచి ఎంత ప్రయత్నించినా నీరు రావడంలేదు. దుఃఖం దిగమింగుకొని వెనకకు బయలుదేరాడు.

ఆ రాత్రంతా నిద్రలేదు. ఉదయం లేస్తూనే మరలా స్టెనోని కలుసుకొన్నాడు. ఇతన్ని చూడగానే జరిగిందేదో వూహించుకొన్నాడు. "అరె, భాయ్! చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం బుద్ధిమంతుల లక్షణం కాదు! ఆ తెలివి ముందే ఉండాలి'' అంటూ పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ తిట్టి తరువాత ఎవరికో ఫోన్ చేసి పది నిముషాలు మాట్లాడాడు.

తరువాత అనిల్‌వైపు తిరిగి, "అయ్యా, రేపు 'సి' సెక్షనునుంచి ఒక క్లర్కు హైదరాబాదు పోతున్నాడు. అతను అక్కడే ఉండి తపాలు రాగానే గుమస్తాకు చెప్పి నీ లెటరు తప్ప మిగతా కాగితాలు స్పెషల్ ఆఫీసర్ టేబుల్‌మీదికి పోతాయి. నీ లవ్ లెటరు ముందే ఆఫీసు పేపర్సులోంచి విడతీస్తాడు. ఈ పని జరగాలంటే అక్కడ గుమస్తాకు నువ్వో పాతిక ఇచ్చుకోవాలి'' అంటూ తల వంచుకొని ఎడమ

చేతిని పొడుగ్గా జాపాడు.

ఆ చేతిలో పాతిక రూపాయలు పెట్టి, స్టైనో ఖర్చుల క్రింద రిమ్మా, రెండు ప్లెయిన్ విల్స్ సిగరెట్టు ప్యాకెట్లు ఇచ్చుకొని, కళ్ళలోకి నీళ్ళు ఉబికి మసకలు కాగా అక్కడనుంచి తిరుగుముఖం పట్టాడు.

* * * *

అనిల్ అదృష్టం ఇక్కడా బాగాలేదు. వారం వరకూ ఆత్రతగా ఎదురు చూస్తున్న అనిల్‌కు చావు కబురు చల్లగా చెప్పాడు హైదరాబాదునుంచి వచ్చినాయన. ఆ రోజు స్పెషల్ ఆఫీసరు తనే పర్సనల్‌గా ఓపెన్ చేయాలని తపాలు తెప్పించుకొని చూశాడట. దానితో ఇంకెలాగూ పని కాలేదు గదా అని ఈయన తిరిగి వచ్చేశాడట. రెండు రోజులు గడిచాయి. హైదరాబాదు స్పెషల్ ఆఫీసరు దగ్గరనుంచి టెలిగ్రామ్ వచ్చింది—‘ఆడపిల్లలకు లవ్ లెటర్లు వ్రాసి ఆఫీసు ప్రెస్టిజి చెడగొట్టినందుకుగాను డిసిప్లినరీ ఏక్షను క్రింద అనిల్ కుమార్‌ని ఆరేళ్ళపాటు ఉద్యోగంనుంచి సస్పెండు చేస్తున్నట్లు. కలెక్టరు ఆ టెలిగ్రాము కాపీ అనిల్ కుమార్‌కు కమ్యూనికేట్ చేస్తూ ఆ రోజునుంచే సస్పెండు చేస్తున్నట్లు ఆర్డర్లు కూడా ఇచ్చేశాడు.

అనిల్ ఉద్యోగం వూడిందన్న సంగతి ఇంట్లోనూ, వూరంతా వ్యాపించింది. అనిల్ ఇంట్లో తిట్లు భరించలేక, విధిలేక పూర్వపు తన ఆఫీసు కాంపౌండ్ కాంటీన్‌లో సర్వర్‌గా చేరాడు.


చేరిన మొదటి రోజే వసంత తన ఆఫీసు స్టాఫు అందరినీ తీసుకొచ్చింది. “సర్వర్, నాలుగు బ్రూ కాఫీ! అర్జెంట్.” వెటకారంగా అంది. చేతివ్రేళ్ళు సుతారంగా టేబిలుమీద ఆడిస్తూ తన ఫ్రెండ్సుతో కబుర్లు చెబుతోంది. అనిల్‌కు ఒళ్ళు మండుకొచ్చింది. కాఫీ కప్పులు తెచ్చి ఆమె ముందు పెట్టాడు. చెవిలోంచి పెన్సిలు తీసి, మాసిపోయిన ఖద్దరు పాంటు జేబులోంచి కాగితం తీసి బిల్లు వేశాడు.

“ఇదేమిటి? కాఫీనా! కషాయమా! బ్రూ కాఫీ తేవయ్యా అంటే బుద్ధిలేని కాఫీ తెచ్చావు” అంటూ అందరూ చూస్తుండగానే అతని ముఖం మీద పోసింది.

మేనేజరు ఏదో పొరపాటు జరిగిందని సర్దబోయాడు. అనిల్ ఒళ్ళంతా లావాతో ఉడికే అగ్నిపర్వతం అయింది. “ఛీ!... నీకా నాకా బుద్ధిలేంది? నీ కోతిచేష్టల వల్లనేకదా నేను ఉద్యోగం పోగొట్టుకుని ఈ స్థితికి వచ్చింది. నీవొక బుద్ధిలేని దానివి.” పెద్దగా తిట్టడం మొదలు పెట్టాడు...

“ఎవర్నండీ బుద్ధిలేని వాళ్ళని తిడుతున్నారు?” అంటూ లోపలికి ప్రవేశించింది వసంత. అంత వరకు హాల్లో అతని తల్లితో, తమ్ముడితో మాట్లాడుతున్నదల్లా అతని గదిలోకి వచ్చింది.

కలలోంచి తెప్పరిల్లి వసంత తన ఇంటికి రావడం ఒక అబ్బురంగా భావించిన అనిల్ అంతలోనే తన ప్రస్తుత పరిస్థితి గుర్తుకు వచ్చి దుప్పటి




ముసుగుతన్ని అటు తిరిగి పడుకున్నాడు.

వసంత ప్రక్కనున్న కుర్చీలో కూర్చొంటూ అంది: “ఏమిటోనండీ, ఎన్నిసార్లు అడిగినా మీ మనసులోని మాట చెప్పరు. ఆఫ్ట్రాల్ చెప్పకుండా ఫైలు కలెక్టరుకు పంపినందుకు అన్ని తిట్టారు. అయినా నేనేం మనసులో పెట్టుకోలేదు. ఈ రోజయినా వచ్చి ఆఫీసులో జాయినవుతారు గదూ....”

కొద్దిసేపు జవాబుకోసం ఎదురు చూసి అంది వసంత: “ఇట్సాల్ రైట్! మీ నిర్ణయం ప్రశాంతంగానే తీసుకోండి. కాని మీకోసం ప్రత్యేకంగా స్పెషల్ స్వీటు తెచ్చాను. టేబుల్‌మీద పెడుతున్నాను—తీసుకోండి...” అంటూ అతని జవాబుకుకూడా ఎదురు చూడకుండా వెళ్ళిపోయింది.

‘తనకు రోజుకొక పాడు కల వస్తోంది ఉద్యోగం వూడినట్లు. నాలుగు రోజులనగా హైదరాబాదు పోయిన వ్యక్తి ఇప్పటికి అంతులేడు. ఆలోచనల్లోంచి తెప్పరిల్లి ఇటు తిరిగి టేబిల్‌మీదున్న చిన్న పాకెట్ చేతిలోకి తీసుకొన్నాడు. తెరుద్దామా, వద్దా అని క్షణం ఆలోచించాడు. ‘స్పెషల్ స్వీటు అనిఅంది. కొంపదీసి ఇందులో ఏ నాటు బాంబో లేక పాయిజన్‌తో చేసిన హాటో లేదు కదా’ అని అనుమానించి, ఏమయితే అయిందని ఓపెన్ చేశాడు. అందులో ఇతనూహించిన వేమీ లేవుగాని, ఎర్ర గులాబీకి పిన్‌చేసిన ఉత్తరం ఒకటి ఆహ్వానించింది. వూపిరి బిగపట్టి చదివాడు. అతనిలో ఆనందం వెర్రిగంతులేసింది. పదిసార్లు ముద్దుపెట్టుకొన్నాడు. అందులో...

“డియర్ అనిల్ కుమార్‌గారూ,

ప్రతి మనిషికీ ఒక మనసుంటుంది. ఆ మనసుకు కొన్ని భావాలుంటాయండి. ఆ భావాలకు మనం చేయూత నివ్వాలిగాని, వాటితో ఆటలాడుకో కూడదు. నేను ఉద్యోగంలో చేరిన రోజున మిమ్మల్ని చూసి ‘షాక్’ తిన్నాను. మీరూ నన్ను ‘ఎక్కడ చూశానా’ అన్నట్లు మీమాంసలో పడ్డారు. మనం ఒకర్నొకరం చూసుకొంది ఒక పవిత్ర స్థలంలో పెద్దల ముందండీ! అంటే ఇప్పుడర్థమయ్యి ఉంటుంది—మనం ఒకర్నొకరం చూసుకుంది పెళ్ళి చూపుల్లోనని. అందరం ఒకరి కొకరం నచ్చామనుకొన్నాము. కట్నాల దగ్గర మీరు అసంతృప్తిగా ఉన్నారని అప్పుడే అర్థమయింది. వారం రోజుల తర్వాత మీ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది—‘మీ అమ్మాయి అక్కర్లేదు. వేరే సంబంధం చూసుకొంటున్నాము’ అని.

హుం...ఈ సమాజంలో మనుషుల్ని కొనడం సహజమైపోయింది. మమత, మానవత్వం కనుచూపు మేరలో కనిపించడం లేదు. హృదయ వైశాల్యం లేకుండా పోయాయి. అలా ఎన్నో పెళ్ళి చూపులకు అలంకరించుకొని షో కేసులో బొమ్మలా ఉన్నాను...తరువాత కొంతకాలానికి మా ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. మా నాన్న రిటైరయ్యాడు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ దాదాపు పదిహేను వేలవరకు వచ్చింది. దాంతో నా కేదైనా సంబంధం చూసి చేస్తానన్నాడు. నేను ససేమిరా ఒప్పుకోలేదు. ఉద్యోగం చేసి నాకు నచ్చినవాణ్ణి చేసుకొంటానని వాళ్ళని బలవంతాన ఒప్పించి, ఆ మొత్తాన్ని ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేయించి, చివరకు ఈ ఉద్యోగంలో చేరాను.

మిమ్మల్ని చూడగానే మీరు ఫలానా అని గుర్తించగలిగాను. మీ ప్రవర్తన చూస్తే మీ కింకా పెళ్ళి కాలేదని తెలిసిపోయింది. మరురోజు మీకంటే ముందుగా వచ్చిన నేను, మీకోసం స్కూలునుంచి వచ్చిన మీ తమ్ముడు నన్ను చప్పున గుర్తుపట్టి ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు. ‘వదినా’ అంటూ. మీరు జిల్లాల వారీగా ఆంధ్రా అంతా అమ్మాయిలకోసం వేటాడారని, కట్నాల దగ్గర ఎక్కడా కుదర్లేదని తెలిసింది. మిమ్మల్నొకసారి పట్టి చూడాలని నాటకం ఆడాను.

మీరు మంచివారే కాని, మీకు ధైర్యం లేదు. ఉంటే ఏనాడో మీరు తల్లితండ్రుల్ని ఎదిరించి ఎవర్నో ఒకర్ని చేసుకొని ఉండేవారు. ఆ రోజు ఫైలు టైపు చేసేటప్పుడు మీ లవ్‌లెటర్ చదివాను. పదిలంగా దాన్ని నా గుండెలో దాచుకొన్నాను. మిమ్మల్ని నేనెంతగానో ప్రేమిస్తున్నాను.

మీ విషయం ఇప్పుడు తేలాలి. మీరు నిజంగా నన్ను ప్రేమిస్తే మా ఇంటికి వచ్చి తెలియజెయ్యండి. నేను ఇష్టం లేకున్నా వచ్చి మీ లెటర్ భద్రంగా తీసుకెళ్ళండి.

ఇట్లు,
మీ కేమవుతానో తెలియని,
—వసంత.”

* * * *

“అన్నయ్యా! వసంత వదిన ఇప్పుడే వచ్చి అమ్మతో మాట్లాడి వెళ్ళింది...” అనిల్‌కుమార్‌కు మరేం వినిపించడం లేదు. హేంగరుకున్న షర్టు తగిలించుకొని ఒక్క ఉదుటున రోడ్డుమీద పడ్డాడు, తన ప్రక్కనే వసంతను వూహించుకుంటూ.

*